క్లుప్తంగా

మొగల్తూరు ఎంఈఓగా శామ్యూల్ జాన్


శామ్యూల్ జాన్

మొగల్తూరు: మండల విద్యాశాఖాధికారిగా ఉన్నమట్ల శామ్యూల్ జాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నరసాపురం మండలం చిట్టవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శామ్యూల్ జాన్ పదోన్నతిపై ఎంఈఓగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న పుష్పరాజ్యం నరసాపురం-1 ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్ జాన్‌ను పలువురు ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ లక్ష్మీకాంతం మృతి



పెనుమంట్ర: వెలగలవారిపాలెం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ మాంద్రు లక్ష్మీకాంతం (75) సోమవారం రాత్రి మృతి చెందారు. దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమానిగా ఉంటూ ఆ గ్రామ ఎంపీటీసీగా 2000 సంవత్సరం నుంచి 2005 వరకు పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీకాంతం మృతిపై స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పెనుగొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి తదితరులు సంతాపం తెలిపారు.

అధిక ఫీజులను నియంత్రించాలని వినతి

సాక్షి, భీమవరం: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్న ఫీజు దోపిడిని అరికట్టాలని అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నాయకులు ఆర్డీఓ దాసి రాజుకు వినతిప్రతం అందజేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏబీవీపీ నగర్ సహాయ కార్యదర్శి వీడీ సిద్ధార్థ ఆధ్వర్యంలో వినతిప్రతం అంఅందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు పేరిట పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కె.దిన్ను, జి.గణేష్, బి.తేజ, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పంటకాలువలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు పంటకాలువలో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాలు సాగు, తాగునీరు ప్రవాహానికి ఆటంకం కలగడంతో తొలగించారు. జూన్ 1న ఇరిగేషన్ అధికారులు పంటకాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో రెగ్యులేటర్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం పేరుకుపోయాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి తమ సిబ్బందితో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం తొలగిస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ భూపతిరాజు వెంకట ప్రసాదరాజు మాట్లాడుతూ పంటకాలువల్లో చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిగువ గ్రామాల ప్రజలు ఈ నీటినే తాగుతున్నారని గమనించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

గోదాములో అగ్ని ప్రమాదం

సాక్షి, భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలో ఉన్న ఒక గోదాములో మంగళవారం రాత్రి మంటలు ఎగసిపడ్డాయి. గోదాములో బ్లీచింగ్‌తోపాటు శానిటరీ సామగ్రి ఉందని పలువురు చెబుతున్నారు. మంటలతో పాటు దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రమాద పరిసర ప్రాంత ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపకాధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు , సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఆకివీడు: అంగన్ వాడీ కేంద్రాల్లో పనితీరు, పరిశుభ్రతల్ని మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ పరిశీలించారు. బాల బాలికల హాజరు, వారికి అందుతున్న పౌష్టికాహారం, బాలింతలు, గర్భిణుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. పసి కందులకు పెట్టే ఆహారంలో లోపాలు రానివ్వవద్దని సూచించారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం వారికి పూర్తి స్థాయిలో అందినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కమిషనర్ చెప్పారు. ఆయా కేంద్రాల్లో పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రత్నకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు పూర్తి

ఆకివీడు: మండలంలో, పట్టణంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులు భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు జరిగినట్లు ఎంపీడీఓ కె.వాణీ చెప్పారు. మొత్తం 10 పోస్టులకు 11 దరఖాస్తులు రాగా, ఇంటర్వ్యూలకు 8 మంది అభ్యర్థులే హాజరయ్యారని ఆమె తెలిపారు.

వలంటీర్ల సేవలకు వందనం

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


పట్టణంలోని రామయ్య హాలులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: జగనన్న సైనికులుగా వలంటీర్లు అందించే సేవలు అభినందనీయమని నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో పాలకొల్లు పురపాలక సంఘ వార్డు సచివాలయాల వలంటీర్ల సేవలకు గాను సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ప్రారంభమై నాలుగేళ్లు కావస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ప్రారంభమైన కొత్తలో ప్రతిపక్ష పార్టీలు ఎన్నో విమర్శలు చేశాయన్నారు. అలాంటిది ఆ ప్రతిపక్ష పార్టీల నాయకులే నేడు వలంటీర్లను పక్కన పెట్టేది లేదని చెప్పే స్థాయికి ఈ సచివాలయ సిబ్బంది వచ్చారంటే ప్రజల్లో ఎంత గుర్తింపు తీసుకువచ్చారో? అర్థమవుతుందన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా సంక్షేమ పథకాల గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటామన్నారు. అలాంటిది రాష్ట్ర ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎలా సుస్థిరస్థానం సంపాదించుకున్నారో? అలాగే వార్డు వలంటీర్‌లు కూడా వాళ్ల పరిధిలో ఉన్న 50 కుటుంబాల్లో అంతే స్థానం సంపాదించుకున్నారన్నారు. తాము కూడా అధికారులకన్నా వలంటీర్‌ను పిలిచి వివరాలు అడిగి తెలుసుకునే స్థాయిలో వాళ్లు ప్రజలతో మమేకమయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన అవార్డుల్లో సేవా వజ్రకు రూ. 30 వేలు, సేవారత్నకు రూ. 20 వేలు, సేవా మిత్రలకు రూ. 10 వేలు అందజేశారు. పట్టణంలో 14 సచివాలయాల్లో పని చేస్తున్న వలంటీర్లలో సేవావజ్రగా 7వ సచివాలయానికి చెందిన నల్లి రవీంద్ర, సేవా రత్నలుగా 3, సేవా మిత్రలుగా 370 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ మూడు సేవలకు ఎంపికైన వలంటీర్లను శాలువలతో సన్మానించి, ప్రశంసాపత్రం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మద్దాల వాస్, నాయకులు మానుకొండ శ్రీనుబాబు, మద్దా చంద్రకళ, చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్, సాలా నర్సయ్య, జోగి వెంకటేశ్వరరావు, మునిసిపల్ డీఈ సాంబశివుడు, సీఎంఎం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగుకి కృషి

పాలకొల్లు అర్బన్: పేదల జీవన ప్రమాణాలు మెరుగుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 11వ వార్డు రామయ్యహాలులో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది వేసవిలో మహిళలు బిందెలతో మంచినీరు కోసం బయటకు రాకుండా రెండు పూటలా మంచినీరు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. జీ+1 కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, మంచినీరు కోసం రూ.60 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. పట్టణంలోని దేశాలమ్మ గుడి వద్ద వర్షం కురిస్తే మురుగు నీరు ఎటూ కదలకుండా రోజుల తరబడి అలాగే నిలిచిపోయేదని, అయితే రూ.70లక్షలతో సీసీ రోడ్డు ఎత్తు చేసి డ్రెయిన్ నిర్మించామని వివరించారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు కమీషన్లు దండుకుని శిలాఫలకాలు వేయించుకోవడం తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు జీ+1 కాలనీలో ఇంటి నిర్మాణాలకు సహకరించాలని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ని కోరారు. దీంతో ఆయన స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన లబ్ధిదారుల ఇళ్లను తక్షణం పూర్తి చేయడానికి గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, వార్డు ఇన్‌చార్జ్ మద్దా చంద్రకళ, వార్డు నాయకులు నల్లి జయరాజు, ఉల్లంపర్తి రవి, కోట రత్నరాజు, సోడగిరి రమేష్‌బాబు, పైలా రాజశ్రీ, నక్కా చిత్తరంజన్, పిట్టా రాజ్‌కుమార్, శిడగం రమణ, పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు, పీటర్‌సన్ చిన్ని ఖండవల్లి వాసు, ధనాల శ్రీనివాస్, కోరాడ శ్రీనివాస్, చెన్ను విజయ్, చినిమిల్లి గణపతిరావు, యడ్ల సత్యనారాయణ, రుంకాని దుర్గారావు, నక్కా ఇర్మియారాజు, నల్లి నాగరాజు, బండి రమేష్, పాలపర్తి కృపనాథ్, రేలంగి నరసింహారావు (దున్ను) పాల్గొన్నారు.

పేద విద్యార్థుల బాధ్యత జగనన్నదే


యలమంచిలి హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలతో ఎంపీపీ రావూరి వెంకటరమణ

యలమంచిలి: మన రాష్ట్రంలో పేద విద్యార్థుల చదువు బాధ్యత పూర్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్నారని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం ఆమె ఆణిముత్యాల నగదు పురస్కారం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లుల బుజ్జి, నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి), గుబ్బల శ్రీనివాస్, బొక్కా సురేష్, హెచ్‌ఎం చింతా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న ప్రజా రవాణా సేవలు, కార్గో సేవలు, విహార యాత్రలు, శుభకార్యాలకు బస్సులు ఏర్పాటు చేయడం వంటి అంశాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. నరసాపురం డిపోపరిధిలోని నరసాపురం, పాలకొల్లు, ఆచంట, మొగల్తూరు , పెనుగొండ ప్రాంతాల ప్రయాణికులు 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రజలకు చేరువైన జగన్ ప్రభుత్వం


వార్డు కమిటీ అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు ముదునూరి ప్రసాదరాజు


సరిపల్లి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు, ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్

నరసాపురం: సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ వార్డు కమిటీల అధ్యక్షులుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని దాటుకుంటూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. రూ.6800 కోట్లు ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టిందన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా దోపిడీని ప్రోత్సహించిందని చెప్పారు. మన ప్రభుత్వంలో కుల,మత, పార్టీలుకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోసపూరిత హామీలు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వివరించారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముఖ అన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, బర్రి జయరాజు, బర్రి శంకరం తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన మంచినీటిని అందించాలి

ప్రజలకు పట్టణంలో సురక్షితమైన మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మంగళవారం ముదునూరి తన కార్యాలయంలో పట్టణంలో మంచినీటి సరఫరాపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా నీటిని పూర్తిస్థాయిలో శుభ్రపరిచి కుళాయిల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఫిల్టరింగ్, క్లోరినేషన్, ప్యూరిఫికేషన్ విషయంలో ఎక్కడా అలసత్వం చూపించవద్దని సూచించారు. వర్షాకాలంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని డ్రెయినేజీల పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలుంటే సరిచూసుకోవాలని చెప్పారు. నిర్మాణ దశలో ఉండి, ఇంకా పూర్తికాని అభివృద్ధి పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఫంక్షన్ హాల్‌గా అభివృద్ధి చేస్తున్న పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, కౌన్సిలర్ బర్రి జయరాజు పాల్గొన్నారు.

సరిపల్లి సచివాలయ ఆకస్మిక తనిఖీ

నరసాపురం రూరల్: సచివాలయ వ్యవస్థలో పని చేసే వారంతా బాధ్యతా యుతంగా పనిచేయాలని చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సూచించారు. నరసాపురం మండలంలోని సరిపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్‌తో కలసి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఇంజేటి జాన్‌కెనడీ, మైలాబత్తుల శ్రీను, గమిడి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల నిర్వహణ అభినందనీయం


విజేతలైన చిన్నారులను అభినందిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తన కుమారుడు పేరుతో నడుపుతున్న అభయ్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతీఏటా ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ స్థాయిలో చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. గత నెలలో జరిగిన పోటీలకు సంబంధించి మన జిల్లా నుంచి పాల్గొన్న విజేతలకు మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు బహుమతులు అందించారు. 10 మందికి రూ 15వేలు చొప్పున నగదు బహుమతి, షీల్డ్‌లు అందించారు. నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ఈ ఏడాది 17 దేశాలకు చెందిన 200 మంది పాల్గొన్నారని చెప్పారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి


పాలకొల్లులో తహసీల్దార్ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పసుపులేటి డేవిడ్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ సిహెచ్ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు దిగమర్తి ఆశీర్వాదం, బాలం బాలకృష్ణ, తెన్నేటి నిర్మల, శాంతి, బొజ్జా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు దివ్యాంగ నాయకులు మంగళవారం ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు బమ్మిడి అప్పారావు, ఒడుగు సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ 6వేలకు పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలకపల్లి రమేష్, పి రాంబాబు, రామాంజనేయులు, ముఖేష్, సత్యవతి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


నాడు-నేడు రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డీఈ కేఈడీఆర్ స్వామి

నరసాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో నిర్మిస్తున్న పాఠశాల భవనాలు, అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని పంచాయతీరాజ్ డీఈ కేడీఆర్ స్వామి అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నాడు-నేడు రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంఈఓలు పిల్లి పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్‌లతో కలిసి సమీక్షించారు. నిధుల వినియోగం, అంచనాలు, పనుల ప్రగతి తదితర వివరాలను పాఠశాలల వారిగా అడిగి తెలుసుకున్నారు. మండలంలో 33, పట్టణంలోలో 8 పాఠశాలలు వెరశి మొత్తం 41పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటున్నందున పనులు మరింత వేగవంతంగా చేపట్టి త్వరిత గతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

పేదలపాలిట వరం ఫ్యామిలీ ఫిజీషియన్


సీతారాంపురం నార్త్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ నిర్వహిస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం పేద, మధ్యతరగతి ప్రజల పాలిట వరంగా మారింది. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీతారాంపురం నార్త్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఏ చిరంజీవి రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ మంగతాయారు, హెల్త్ అసిస్టెంట్ చింతపల్లి రవి, సీహెచ్‌వో వైధుర్య, ఏఎన్‌ఎం రామలక్ష్మి, ఆశాలు శాంతిలత, దుర్గా భవాని పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు బహుమతి


విద్యార్థినికి నవ్యకు నగదు బహుమతి అందిస్తున్న ఎస్‌బీఐ యూనియన్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో కృషి..పట్టుదల ఉంటే ఎలా..ఎక్కడ చదివినా ర్యాంకులు వాటంతటవే వస్తాయని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ నాయకుడు కేఎన్ శివాజీ అన్నారు. మంగళవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రదాన కార్యాలయంలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ వై.తారకనాథ్ 19వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిన బీఆర్‌ఎంవీ మునిసిపల్ గరల్స్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థిని ఆర్. నవ్య తరంగిణికి రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ యూనియన్ నాయకులు ఎంఎస్‌ఎన్ బాబు, బి.సూరిబాబు, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ప్రభాకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా డ్రెయిన్ పనుల పూర్తి


డ్రెయిన్ పనులను పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న డ్రెయిన్ పనులను మంగళవారం మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. గ్రామంలో డ్రెయిన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో గడపగడపకు కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి యుద్ధప్రాతికపదికపై గారగాలమ్మ డ్రెనేజీ ప్రక్షాళన పనులను చేపట్టారు. పనులు ప్రారంభించినప్పటి నుంచి శ్రీరంగనాథరాజు ప్రతిరోజు డ్రెయిన్ పనులను పర్యవేక్షిస్తూనే ఉన్నారు. డ్రెయిన్ మొదటి దశ పనులు పూర్తి కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నల్లపరాజు వేణుగోపాల ఆదినారాయణ రాజు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి రాముడు, బలుపు కేదారి, కుడిపూడి రామకృష్ణ, వీఆర్వో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్ రాజకీయాలకు అనర్హుడు


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: కులాల మధ్య చిచ్చు పెట్టి యువతను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజకీయాలకు అనర్హుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు అన్నారు. ఏఎంసీ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రాణ హాని ఉందని, సుపారీ గ్యాంగ్‌లు వచ్చాయని పవన్ కల్యాణ్ చౌకబారు విమర్శలు చేసి జనసేన పార్టీకి చెందిన యువతను రెచ్చగొడుతున్నారన్నారు. చంద్రబాబు వల్లే పవన్‌కి ప్రాణ హాని ఉందన్నారు. తనకు నిజంగా ప్రాణ హాని ఉంటే రాష్ట్ర డీజీపీని కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేయవచ్చని వినిస్టన్‌బాబు సలహా ఇచ్చారు. అన్నదమ్ములుగా జీవిస్తున్న మాల, మాదిగలను విడదీసిన ఘనత చంద్రబాబుదేనన్నారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్ర కుల పేదలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచినంత కాలం ఎన్ని పార్టీ ఏకమైనా జగన్‌ని ఓడించలేరని వినిస్టన్‌బాబు అన్నారు. సమావేశంలో లీగల్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లపాటి ఆనందరావు, పార్టీ నాయకులు పాలపర్తి కృపనాథ్, ఏనుగుపల్లి చంద్రశేఖర్, సబ్బే శ్రీను, ఊటాల చిట్టిరాజు, దేవ రాజేష్‌కుమార్, వాసా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశ మందిరానికి తాత్కాలిక మరమ్మతులు

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరం పైకప్పు శిథిలావస్థకు చేరింది. దీంతో సమావేశ మందిరం పైకప్పు తొలగించి రేకు వేసేందుకు రూ.5లక్షలతో మరమ్మతులు చేపట్టారు. సుమారు 4 దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం తరుచూ మరమ్మతులకు నోచుకోవడంతో కార్యాలయం గదులకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆ సమయంలోనే సమావేశ మందిరానికి కూడా మరమ్మతులు చేసినా పెంకులు రాలి పడడం, సీలింగ్ పాడైపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదించడంతో గత నాలుగు రోజులుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నేటి సాయంత్రం మంచినీటి సరఫరా నిలిపివేత

నరసాపురం: హెడ్ వాటర్ వర్క్స్‌లోని ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులు కారణంగా బుధవారం సాయంత్రం పట్టణమంతా మంచినీటి కుళాయిల ద్వారా సరఫరా నిలపేస్తున్నట్లు స్తున్నట్లు మున్సిపల్‌కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మళ్లీ గురువారం ఉదయం పూట నుంచి మళ్లీ యథావిధిగా మంచినీటి సరఫరా కొనసాగుతుందని ప్రజలు గమనించాలని చెప్పారు.